శుక్రవారం ౹ 23 ౹ ఫిబ్రవరి ౹ 2024



పసిడి ధరలు పైపైకి.. 8లో▸

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. సామాన్యుడికి అందనంత దూరం చేరింది.



విద్యార్థిపై కత్తితో దాడికి యత్నం

తొమ్మిదో తరగతి విద్యార్థి తోటి విద్యార్థిపై కత్తితో దాడికి యత్నించాడు. జిల్లా విద్యాధికారి ప్రణీత వెంటనే ఈ ఘటనపై పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /18.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలి తీవ్రత కొనసాగుతుంది.

డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా..



బజార్‌హత్నూర్‌లో పత్తి చేను మధ్య గంజాయి మొక్కలు (ఫైల్)

- టీఎస్ న్యాబ్‌కు ఎక్సైజ్ సహకారం
- సమగ్ర ఫలితాలు రాబట్టేందుకే..
- జిల్లా నోడల్ అధికారి నియామకం

సాక్షి, ఆదిలాబాద్: మాదకద్రవ్యాల ఉత్పత్తి, అక్రమ రవాణాను నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీఎస్ న్యాబ్)ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు పోలీస్ అధికారులతో సమాచార సేకరణ, స్వాధీనం, విచారణ, ప్రాసిక్యూషన్‌ను టీఎస్ న్యాబ్ ద్వారా నిర్వహిస్తూ వచ్చారు. నేరాలను ఎదుర్కోవడంలో మరింత సమగ్రమైన ఫలితాలు సాధించేందుకు టీఎస్ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య సూచనల మేరకు ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ సహకారం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ జిల్లా స్థాయిలో నోడల్ అధికారి (నార్కోటిక్స్)ను నియమించింది. కాగా, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) వీబీ కమలాసన్‌రెడ్డి నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో నోడల్ అధికారులు

నోడల్ అధికారులుగా ఆదిలాబాద్ జిల్లాకు ఆదిలాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజేందర్, కుమురం భీం ఆసిఫాబాద్‌కు డీపీఈవో బీ జ్యోతికిరణ్, మంచిర్యాలకు ఇన్‌స్పెక్టర్ ఎం.హరి, నిర్మల్ జిల్లాకు డీపీఈవో ఎండీ అబ్దుల్ రజాక్‌ను నియమించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రధానంగా డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించేందుకు పాటుపడుతోంది. అయితే.. హైదరాబాద్ సిటీలోనే దీని ప్రభావం అధికంగా ఉండగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయిలో గంజాయి, నాటుసారా లాంటి మత్తు పదార్థాల ప్రభావం ఉంది. వీటి నివారణపై పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ శాఖల పరంగా ముందు నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాగా, రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన విషయంలో సర్కారు టీఎస్ న్యాబ్‌ను ఏర్పాటు చేసింది. దీనికి సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా స్థాయిలో ఎక్సైజ్ శాఖకు చెందిన నోడల్ అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు.

గంజాయి సాగుపై నజర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగు విచ్చలవిడిగా సాగుతూ వస్తోంది. దీన్ని నిర్మూలించేందుకు పోలీస్, ఎక్సైజ్ శాఖలు విస్తృత ప్రయత్నాలు చేస్తున్నాయి. అయినప్పటికీ పూర్తి స్థాయిలో నిర్మూలించలేక పోతున్నాయనే విమర్శ ఉంది. కాగా, హైదరాబాద్ సిటీలో ఇటీవలి కాలంలో విద్యాసంస్థల దగ్గర పిల్లలకు విక్రయించిన చాక్లెట్లలో మత్తు పదార్థాలున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు టీఎస్ న్యాబ్ ద్వారా విస్తృత ప్రయత్నాలు సాగుతున్నాయి. దీంట్లో పోలీసులతో పాటు ఇప్పుడు ఎక్సైజ్ అధికారులు కూడా సేవలందించనున్నారు. ప్రధానంగా జిల్లా స్థాయిలో ఈ నేరాలు జరిగినప్పుడు నిందితులపై కేసు నమోదు చేయడంతో పాటు కోర్టులో నిర్ధారణ జరిగే వరకూ విచారణ విషయంలో వీరి పాత్ర కీలకం కానుంది. తద్వారా ఇతరులు ఇలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు ఆస్కారం ఉండేలా ఈ అధికారులు వ్యవహరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

మాదకద్రవ్యాలను రూపుమాపుతాం



మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో రూపుమాపేందుకు పాటుపడుతున్నాం. టీఎస్ న్యాబ్‌కు సహకారం అందించేందుకు జిల్లా స్థాయిలో ఎక్సైజ్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి నలుగురు అధికారులు నియమితులయ్యారు.

– నర్సింహారెడ్డి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

'రాముడి పేరుతో గెలుపునకు బీజేపీ యత్నం'



సమావేశంలో మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రాముడి పేరు చెప్పి పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి గెలిచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రానికి వచ్చిన బండి సంజయ్ బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిపై చేసిన ఆరోపణలు ఖండించారు. కేసీఆర్‌ను విమర్శిస్తే సహించబోమని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపించే సమయంలో సరిహద్దుల్లో యుద్ధాలు, రాముడి పేరు చెప్పి ఓట్లు అభ్యర్థించడం బీజేపీకి సర్వసాధారణంగా మారిందన్నారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.7వేల కోట్ల నిధులు కేటాయించిందని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన సోయం బాపూరావు, బండి సంజయ్‌కు వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్క పనీ చేయలేదని ఆరోపించారు. అత్యధిక ఆదాయం ఇస్తున్న దక్షిణ మధ్య రైల్వేకు కేంద్రం రూ.500 కోట్లు కేటాయిస్తే, ఉత్తర భారత దేశానికి రూ.17వేల కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఎంపీ ఉండి కూడా ఏం ప్రయోజనమని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు ఏ పార్టీతో పొత్తు పెట్టుకునే అవసరం లేదని, స్థానిక సంస్థల్లో కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కవుతున్నాయని తెలిపారు. బీజేపీ నాయకులు కాంగ్రెస్‌ను ప్రశ్నించకుండా ప్రతిపక్ష పార్టీలో ఉన్న కేసీఆర్‌ను సవాల్ చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇజ్జగిరి నారాయణ, అశోక్ స్వామి, శ్రీనివాస్, రాంకుమార్, ఆసిఫ్, పండ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాష్టారుగా మారిన కలెక్టర్



బోర్డుపై ప్రశ్నలు రాస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

గుడిహత్నూర్: ఎప్పుడూ పరిపాలన విధుల్లో బిజీబిజీగా ఉండే కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి కాసేపు మాష్టారుగా మారారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో కలెక్టర్ పాఠశాలను సందర్శించారు. పలు తరగతి గదుల్లో చాక్‌పీస్ పట్టి బ్లాక్ బోర్డుపై ప్రశ్నలు రాసి విద్యార్థుల ద్వారా సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. కాగా, విద్యార్థులు తరగతికి తగిన సామర్థ్యాలు లేకుండా ఉన్నారని బోధన సిబ్బందిపై అసహనం వ్యక్తంచేశారు. దీంతో కేవలం బోధన సిబ్బందిని సమావేశ గదికి పిలిపించి గంట పాటు సమీక్షించారు. కలెక్టర్ అంత సేపు ఉపాధ్యాయులను సమీక్షించడంతో కలెక్టర్‌తో పాటు వచ్చిన ఇతర అధికారులు బయటే వేచి ఉంటూ సమస్య తీవ్రతపై చర్చించుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ సమీక్షలో పేర్కొన్న విషయాలపై దృష్టి సారించాలని మండల విద్యాధికారి నారాయణ, ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ కవితారెడ్డి తదితరులున్నారు.

యాత్ర విజయవంతం

కైలాస్‌నగర్: జిల్లాలో బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర విజయవంతమైందని యాత్ర కుమురంభీం క్లస్టర్ సహ ప్రముఖ్ రావుల రాంనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఆదిలాబాద్, ఇంద్రవెల్లి, ఉట్నూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలు, బహిరంగ సభలకు ప్రజలు అధికసంఖ్యలో హాజరైనట్లు పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్‌లో రెండోసారి బీజేపీని గెలిపించి ప్రధాని మోదీకి బహుమతిగా ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. యాత్ర సక్సెస్ కావడంతో పార్టీ తరపున జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

రిమ్స్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న రిమ్స్ కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: కార్మికుల వేతనాల్లో కోత విధించడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో కార్మికులు నిరసన తెలిపారు. కాంట్రాక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంట్రాక్ట్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడారు. రిమ్స్‌లో పనిచేస్తున్న దాదాపు 500 మంది పారిశుధ్య, పేషెంట్‌కేర్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డుల వేతనాల్లో రిమ్స్ కాంట్రాక్టర్ కోత విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో కార్మికుడి వేతనం నుంచి రూ.2వేల వరకు దోచుకుంటున్నారని ఆరోపించారు. దాదాపు రెండేళ్లుగా ఈ తతంగం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే కాంట్రాక్టర్‌ను తొలగించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే మార్చి 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చందు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముజీబ్, బాధ్యులు ఖాసిమ్, గంగు, లక్ష్మి, సంగీత, సైఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలను గెలిపించుకుందాం'



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఆదిలాబాద్‌రూరల్: ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి మాదిగలను గెలిపించుకుందామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. మాదిగల జోడోయాత్ర గురువారం ఆదిలాబాద్‌కు చేరింది. మావల మండలం కేఆర్కే కాలనీలోగల హరిజనవాడలో కొనసాగిన యాత్రలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని, ప్రభుత్వ రంగాలను ప్రైవేట్ పరం చేసి ఈ రిజర్వేషన్లు దాదాపు తగ్గించిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగల జోడోయాత్ర శుక్రవారం ఇంద్రవెల్లి, ఖానాపూర్, పెద్దపల్లిలో ఉంటుందని తెలిపారు. నాయకులు మల్లెల మనోజ్, నక్క రాందాస్, బరిక్ రావు, రవి, సరోజ, నేషనల్ దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బుదాల బాబురావు, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్ద యాదయ్య, బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్ తదితరులున్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి



నివాళులర్పిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని జిల్లా విద్యాధికారి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ ప్రణీత సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నిర్వహించిన థింకింగ్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదట స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బెడెన్ పావెల్ దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధ్యక్షుడు కాంచనపల్లి రత్నాకర్ మాట్లాడుతూ.. జిల్లాలో శిక్షణశిబిరాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దేవేంద్ర పటాస్కర్, జిల్లా కార్యదర్శి ఎస్.స్వామి, జిల్లా హెడ్‌క్వార్టర్ కమిషనర్ పార్థసారథి, జిల్లా కమిషనర్లు గుండి మహేశ్, నిర్వాణశాస్త్రి, ట్రైబల్ వెల్ఫేర్ స్కౌట్స్ ఇన్‌చార్జి యాదవరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ జీ లక్ష్మి, శిక్షణ కమిషనర్ నాగిరెడ్డి, ట్రైనింగ్ కౌన్సిలర్ వినోద్‌రెడ్డి, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ సర్కార్‌నే కోరుతున్న జనం

- ఇది బీజేపీకి ఎక్కువ సీట్లిచ్చిన జిల్లా
- ఇక్కడి ప్రజల చైతన్యం ఆశ్చర్యకరం
- గిరిజనుల భూములు గుంజుకున్న దుర్మార్గుడు మాజీ సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ సర్కార్ 'పోడు' పట్టాలివ్వాలి
- రాష్ట్ర మాజీ మంత్రి ఈటల రాజేందర్
- కొనసాగిన విజయసంకల్ప యాత్ర



ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఈటల రాజేందర్, పక్కన ఎంపీ, ఎమ్మెల్యే



ముత్నూర్‌లో కుమురంభీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈటల రాజేందర్

కైలాస్‌నగర్/ఇంద్రవెల్లి: భారతదేశాన్ని ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలబెట్టిన నరేంద్రమోదీయే ప్రధానిగా ఉండాలని కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ, అరుణాచల్‌ప్రదేశ్ నుంచి కచ్ వరకూ దేశంలోని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం కుమురంభీం క్లస్టర్ పరిధిలోని ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లో నిర్వహించిన బస్సుయాత్రకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుమురంభీం, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీ, రోడ్ షోల్లో పాల్గొన్న ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ సీట్లిచ్చి ఆదిలాబాద్ జిల్లా ధర్మాన్ని కాపాడిందని పేర్కొన్నారు. బీజేపీని ఆదరించిన జిల్లా ప్రజల చైతన్యానికి చేతులెత్తి మొక్కుతున్నానని తెలిపారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని మోదీకి బహుమతిగా అందించి ఆశీర్వదించాలని కోరారు. ధరణి పోర్టల్‌ను తెచ్చి అడవిని, చెట్టు, పుట్టను నమ్ముకుని పోడు వ్యవసాయం చేసుకుని జీవించే గిరిజనుల పొట్టకొట్టిన దుర్మార్గుడు మాజీ సీఎం కేసీఆర్ అని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, దాన్ని నిలబెట్టుకుని గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం లాగా గిరిజనులను గోస పెట్టకుండా వారికి పూర్తి హక్కులు కల్పించాలన్నారు. రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని తెలిసి కూడా కాంగ్రెస్ ఆచరణకు సాధ్యం కాని హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. రుణమాఫీ కాలేదని, రైతుబంధు రూ.15వేల ఊసే లేదని, కౌలురైతులకు రూ.12వేలు అందలేదని, మహిళలకు రూ.10లక్షల వడ్డీలేని రుణాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో బస్సు తప్ప ప్రజలకు ఏదీ రాలేదని ఎద్దేవా చేశారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచి మహిళలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. దేశంలో మోదీ వచ్చాక మతఘర్షణలకు తావులేదని పేర్కొన్నారు. ప్రపంచపటం మీద నంబర్ వన్‌గా నిలిపి భారత్‌ను విశ్వ గురువుగా పిలిచే స్థాయికి తీసుకువచ్చారని తెలిపారు. కరోనా సమయంలో ప్రజల్లో ధైర్యం నింపడంతో పాటు వ్యాక్సిన్ అందించి వారి ప్రాణాలు కాపాడారని గుర్తు చేశారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసి, కశ్మీర్‌ను స్విట్జర్లాండ్‌గా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. కొండ ప్రాంతాల్లోని ఆడబిడ్డలు మరుగుదొడ్లు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు స్వచ్ఛభారత్ పేరిట 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించారని తెలిపారు. హిందువుల 500 ఏళ్ల కల ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో అయోధ్యలో శ్రీరామ మందిరం సాకారమైందని తెలిపారు. పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే పబ్బం గడిపిందని విమర్శించారు. ఇంద్రవెల్లి నుంచి ఉట్నూర్‌కు వెళ్లే క్రమంలో శ్యాంపూర్ గ్రామంలో బీజేపీ నాయకులు ఈటల రాజేందర్‌కు ఘనస్వాగతం పలికి సన్మానించారు. గుడిహత్నూర్‌లో ఈటల రాజేందర్‌కు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఇంద్రవెల్లిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది యువకులు బీజేపీలో చేరగా ఈటల కండువాలు కప్పి ఆహ్వానించారు. మండుటెండనూ లెక్క చేయకుండా ప్రజలు హాజరు కావడం బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. కార్యక్రమాల్లో ఎంపీ సోయం బాపూరావ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ తదితరులున్నారు.



ఇంద్రవెల్లిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

న్యూస్‌రీల్

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఉర్దూ ఘర్‌లో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రమేశ్ రాథోడ్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజొద్దీన్, సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలందించాలి

ఆదిలాబాద్‌టౌన్: రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీరామ టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌ను ప్రారంభించారు. ఆస్పత్రి వైద్యురాలు శ్యామల సత్యనారాయణ మాట్లాడుతూ.. తమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇందిరా ఐవీఎఫ్ సెంటర్ ద్వారా సేవలందించనున్నట్లు తెలిపారు. ఐయూఐ, ఐవీఎఫ్, ల్యాప్రోస్కోప్కీ, ఇస్టోస్కోపీ సేవలు అందించనున్నట్లు వివరించారు. రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుమలత, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, శ్యాంప్రసాద్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పనుల నాణ్యత పరిశీలన



మట్టి నమూనా సేకరిస్తున్న అధికారులు

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామ శివారులో చేపట్టిన పిప్పల్‌కోటి రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనుల నాణ్యతను గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ లత సిబ్బందితో కలిసి శాంపిళ్లు సేకరించారు. వీరి వెంట క్వాలిటీ కంట్రోల్ ఏఈ వైష్ణవి, రిజర్వాయర్ ఏఈ దిలీప్, సిబ్బంది ఉన్నారు.

హరితవనం పార్కు సందర్శన




అటవీ సంరక్షణ గురించి వివరిస్తున్న ఎఫ్ఆర్వో

ఆదిలాబాద్‌రూరల్: దూలపెల్లి ఫారెస్ట్ అకాడమీకి చెందిన శిక్షణ ఎఫ్ఆర్వోలు గురువారం మావల మండల కేంద్రంలోని హరితవనం పార్కును సందర్శించారు. అటవీ సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, వన్యప్రాణుల రక్షణ తదితర అంశాలపై ఆదిలాబాద్ ఎఫ్ఆర్వో గులాబ్‌సింగ్ వారికి వివరించారు. వేసవిలో అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి కుంటల గురించి తెలిపారు. డిప్యూటీ ఎఫ్ఆర్వో గీత, ఎఫ్‌బీవో ప్రశాంత్ తదితరులున్నారు.

విగ్రహాలను ధ్వంసం చేసిన నిందితుడిని ఉరితీయాలి

ఆదిలాబాద్‌రూరల్: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బోరపల్లిలో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ధ్వంసం చేసిన నిందితుడిని ఉరి తీయాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పూలే భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిందితుడిని గుర్తించి శిక్షించకుంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవం, వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు, పాడిన పాటలు అలరించాయి. ఎంపీడీవో రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రిపుల్ఐటీ అధ్యాపకునికి డాక్టరేట్



అభినందిస్తున్న డైరెక్టర్ సతీశ్‌కుమార్

భైంసా(ముధోల్): బాసర ట్రిపుల్ఐటీ అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ చాంద్‌రాకేశ్‌రోషన్‌కు వరంగల్ ఎన్ఐటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. బాసర ట్రిపుల్ ఐటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ అభినందించారు.

సీపీఎం రాష్ట్ర సమావేశాల్లో జిల్లా నేతలు



సమావేశంలో జిల్లా నాయకులు

నిర్మల్: సీపీఎం రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాలకు జిల్లా నేతలు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గురువారం నిర్వహించిన ఈ సమావేశాల్లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మార్గదర్శనం చేశారని జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ తెలిపారు. రాష్ట్ర, దేశ ప్రయోజనాల కోసం బీజేపీని ఓడించడమే తక్షణ కర్తవ్యంగా తీసుకోవాలని సూచించారన్నారు. జిల్లా నుంచి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, సుజాత పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖానాపూర్: బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేటలో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. పేకాడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 52 పేక ముక్కలతో పాటు రూ.9,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పసిడి ధరలు పైపైకి..

- సామాన్యుడికి అందనంతగా బంగారం
- పెళ్లిళ్ల వేళ మధ్యతరగతి ప్రజానీకం విలవిల



వెలవెలబోతున్న బంగారం వర్తక దుకాణం

నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. వధూవరులతో పాటు వారి తల్లిదండ్రులు, ఇరు కుటుంబాల వారు వివాహాలు ఘనంగా చేయాలని ఆరాటపడుతున్నారు. వారికి బంగారం ధరల సెగ తగులుతోంది. పెళ్లిళ్ల ఖర్చు, వస్త్రాలు, ఫంక్షన్ హాల్, భోజనాలు వీటన్నిటికీ తోడు పెళ్లికూతురు నగలు తయారు చేయించడానికి చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తోందని పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. పసిడి ధరలు రోజురోజుకూ పైపైకి పోతుండడంతో తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. ఇతర ఖర్చులకు తోడు బంగారం ధరలు కూడా ఆకాశాన్ని అంటుతుండడంతో ఆభరణాలు చేయించడానికి జంకుతున్నారు. మంగళసూత్రం, తాళిబొట్టు, చెవి దుద్దులు, ప్రధాన ఉంగరం, గొలుసు వంటివి తప్ప మిగతా అలంకరణకోసం ఉపయోగించే అదనపు ఆభరణాలు చేయించడానికి ఆసక్తి చూపడం లేదు.

తగ్గని పసిడి ధరలతో తంటాలు..

జిల్లా కేంద్రంలోని బంగారు దుకాణాల్లో రోజువారీగా ధరలు బులియన్ మార్కెట్‌ను అనుసరించి వస్తూ ఉంటాయి. అయితే బంగారం మార్కెట్‌లో బుధవారం నాటి ధరలు 10 గ్రాములకు రూ.64,600, 12 గ్రాములకు రూ.75,350 ఉన్నా యి. దీనికి తోడు పాదాలకు ధరించే పట్టీలు, గొలుసులు వెండితో తయారు చేయిస్తారు. వెండి ధరలు కూడా కిలోగ్రామ్‌కు రూ.73,350 ధర పలుకుతోంది. దీంతో సామాన్యులు నగలు చేయించడానికి ఆసక్తి కనబర్చడంలేదని స్వర్ణకారులు అంటున్నారు. గతంలో మాదిరి బంగారు నగలు ఆభరణాలను చేయించుకోవడానికి దిగువ, మధ్యతరగతి కుటుంబీకులు ఇష్టపడడం లేదని వారు పేర్కొంటున్నారు.

గతేడాదితో పోల్చితే బంగారం, వెండి ధరలు ఇలా..

	ఫిబ్రవరి 2023	ఫిబ్రవరి 2024
బంగారం(10 గ్రాములు)	రూ.56,800	రూ. 64,600
బంగారం(12 గ్రాములు)	రూ.66,750	రూ.75,350
వెండి(కిలో)	రూ.63,500	రూ.73,000

ఆభరణాల తయారీకి ఖర్చులు అదనం..

సాధారణంగా ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన వివాహానికి వధువు కోసం ఆభరణాలు చేయించడానికి కనీసం ఐదుతులాల బంగారం అవసరమవుతుంది. అది కొనడానికి దాదాపు రూ.మూడులక్షల పైచిలుకు డబ్బు కావాల్సి ఉంటుంది. దీనికి తోడు ఆభరణాలు తయారు చేయించడానికి చార్జీలుగా మరో రూ.20 నుంచి రూ.30 వేల వరకు అవుతోంది. మూడు నెలల క్రితానికి ఇప్పటికీ దాదాపు రూ.2,500 పైగా బంగారం ధర పెరిగింది. ఇలా నెలల వ్యవధిలోనే బంగారం ధర ఇంతకింతకు పెరిగిపోతుండడంతో సామాన్యులు బంగారు ఆభరణాలను చేయించుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు.

మధ్యతరగతి వారికి పెనుభారమే...



బంగారం ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సామాన్యులు కొనలేని పరిస్థితి. రోజువారి కూలీ చేసుకుని బతికే మాలాంటి మధ్యతరగతి కుటుంబాల వారికి అందని ద్రాక్షగా మారుతోంది.

– దాసరి ప్రవీణ్, సిర్గాపూర్, మం.దిలావర్‌పూర్

కొనుగోళ్లు బాగా తగ్గాయి



గతేడాదితో పోలిస్తే ఈసారి బంగారం కొనుగోళ్లు బాగా తగ్గాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ అయినా ఆభరణాల తయారీ గిరాకీ అంతంత మాత్రంగానే ఉంది. దీనికి కారణం బంగారం ధరలు అమాంతం పెరగడమే.

– శెట్‌పెల్లి శివ, స్వర్ణకారుడు, నిర్మల్

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కడెం: ఈ నెల 20న ప్రారంభమైన అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి చందన అలంకరణ చేశారు. విష్ణుసహస్రనామ పారాయణం, యాగశాల ద్వారాతోరణపూజ, మూలమంత్రహవనము, నివేదన తీర్థప్రసాదగోష్ఠి పూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

కమనీయం.. గజ్జలమ్మ కల్యాణం



కుంటాల(ముధోల్): కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ కల్యాణం గురువారం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కనుల పండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేద పండితుడు శ్రీ గురుమంచి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉదయం నిత్యవిధి, యజ్ఞం కార్యక్రమం, హారతి మంత్రపుష్పం, ప్రసాద వితరణ తదితర పూజాది కార్యక్రమాలు, సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.



మోదీ హయాంలోనే దేశాభివృద్ధి

- యూపీఏ పాలనలో అనేక కుంభకోణాలు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం కార్మికులు, బెంగాలీలతో సమావేశం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కాగజ్‌నగర్‌రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజా కార్యాలయంలో గురువారం సిర్పూర్ పేపర్ మిల్లు(ఎస్పీఎం) కార్మికులతో సమావేశం అయ్యారు. కాగజ్‌నగర్ మండలంలోని వేదమందిర్ వద్ద బెంగాలీ ప్రజలతో సమావేశమై మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ పాలనలో 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు, కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహణ, తదితర కుంభకోణాల్లో రూ.12లక్షల కోట్లు పక్కదారి పట్టాయని ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగుచెంది 2014 ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారని స్పష్టం చేశారు. ఈ పదేళ్లలోనే దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని అన్నారు. మచ్చలేని నాయకుడిగా మోదీ పేరు తెచ్చుకున్నారని, శత్రువు కూడా మెచ్చుకున్న నాయకుడిగా నిలిచారని కొనియాడారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత కశ్మీర్ ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చుకుంటున్నారని పేర్కొన్నారు. అక్కడ ఉగ్రవాదం, తీవ్రవాదం, ఐఎస్‌ఐ దాడులు ఇప్పుడు లేవని తెలిపారు. ఇప్పటికీ కొన్ని పార్టీలు ఓటు బ్యాంకు, కుటుంబ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఒక్క బీజేపీ మాత్రమే ప్రజాపాలన చేస్తోందన్నారు. దేశంలో జాతీయ రహదారులు, ఉత్పత్తి రంగాల్లో గణనీయమైన మార్పులు రావడంతో ఉపాధి పెరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా కరోనా వ్యాక్సిన్లు తయారు చేసి దేశ ప్రజలకు ఉచితంగా అందించామని, అలాగే 150 దేశాలకు సరఫరా చేశామన్నారు. సమర్థవంతమైన నాయకత్వంతోనే ఇదంతా సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, ప్రభారి రాజమౌళి, కల్లోల భట్టాచార్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు వెంకటేశం, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కుభీర్(ముధోల్): మండలంలోని రంజని గ్రామంలో మూడు రోజులుగా మహాలక్ష్మీ జాతర కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ హాజరై పోటీలను తిలకించారు. పోటీలలో మహారాష్ట్రలోని పలుగ్రామాల మల్లయోధులతో పాటు మండలంలోని పలుగ్రామాల మల్లయోధులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి రూ.5వేలు మహారాష్ట్రలోని బిద్రెల్లికి చెందిన సాయినాథ్ గెలుచుకున్నారు.

తోటి విద్యార్థిపై కత్తితో దాడికి యత్నం

- కప్పిపుచ్చడానికి సిబ్బంది యత్నం
- విచారణ చేపట్టిన డీఈవో ప్రణీత

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని మన్నూర్ జెడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి తోటి విద్యార్థిపై కత్తితో దాడికి యత్నించిన ఘటన చోటు చేసుకుంది. డీఈవో విచారణతో విషయం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఇద్దరు కవలలు ఒకరు 9వ తరగతి, మరొకరు 8వ తరగతి చదువుకుంటున్నారు. 8వ తరగతి చదుకుంటున్న విద్యార్థి అదే తరగతిలో చదువుకుంటున్న బాలికను రెండు రోజులుగా వేధింపులకు గురిచేస్తున్నాడు. బాలిక విషయాన్ని పదోతరగతిలో చదువుకుంటున్న తన అన్నకు చెప్పడంతో సదరు విద్యార్థిని కొట్టాడు. దీంతో ఈ విషయాన్ని ఆ విద్యార్థి 9వ తరగతిలో ఉన్న తన అన్నకు తెలిపాడు. దీంతో అతను కూరగాయలు కోసే కత్తి తీసుకొచ్చి బాలిక అన్నతో గొడవ పడ్డాడు. ఉపాధ్యాయులు మందలించడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం ఉపాధ్యాయులు గ్రామ పెద్దలను పిలిపించి విద్యార్థుల తీరును వివరించారు. విషయం తెలుసుకున్న డీఈవో ప్రణీత హుటాహుటిన పాఠశాలకు చేరుకొని విచారణ జరిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

చోరీకి గురైన బైక్‌లు స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల చోరీకి గురైన రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపారు. జైనథ్ మండలంలోని జామ్నికి చెందిన ఖండేష్కర్ గౌతమ్ ఈ నెల 18న రిమ్స్ ఎమర్జెన్సీ వార్డు ముందు బైక్‌ను పార్క్ చేసి ఆస్పత్రి లోనికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి బైక్ మాయమైంది. పట్టణంలోని శ్రీరాం కాలనీకి చెందిన పీసర రమేశ్ బాలాజీ ఆస్పత్రిలో కంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. రోజులాగే ఆస్పత్రి ఎదుట బైక్ పార్క్ చేశాడు. గంట తర్వాత తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించకుండా పోయింది. వీరిద్దరూ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం తాంసి బస్టాండ్ ప్రాంతంలో మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా మాండకు చెందిన దొడెవార్ రాజేశ్వర్ చోరీకి గురైన వాహనంపై తిరుగుతుండగా వాహనాల తనిఖీల్లో భాగంగా అనుమానం వచ్చిన పోలీసులు ఆయనను విచారించారు. దీంతో చోరీకి గురైన మరో బైక్‌ను రైల్వే స్టేషన్ సమీపంలో దాచిపెట్టినట్లు తెలిపాడు. ఆ రెండు బైక్‌లను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అరెస్టు చేసినట్లు వివరించారు.

ఇసుక చోరీ చేస్తున్న ఒకరి అరెస్టు

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్‌లో మైనింగ్, రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక అక్రమంగా చోరీ చేస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. సుమారు రూ. 2 వేల విలువైన ఇసుకను దొంగతనంగా తరలిస్తున్నారని కావలాదారు అయిన వీఆర్ఏ జాడి గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలికను వేధించిన కేసులో ఏడాది జైలు

నిర్మల్‌టౌన్: బాలికను వేధించిన కేసులో ఒకరికి నిర్మల్ కోర్టు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన బాలిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. శాంతినగర్‌కు చెందిన కొండల్‌వాడ్ బాబా షాదుల్లా నిన్ను ప్రేమిస్తున్నానంటూ వెంటపడి వేధించేవాడు. 2018, ఫిబ్రవరి 15న బాలిక తండ్రితో కలిసి స్కూటీపై వెళ్తుండగా ఆపి మీ అమ్మాయిని ప్రేమిస్తున్నానని, అడ్డు వస్తే చంపుతానని బెదిరించాడు. దీంతో అమ్మాయి తండ్రి నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సైలు బాలకృష్ణ, ఉషన్న కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు 11 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. నిందితునికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ గురువారం తీర్పునిచ్చారు.

గజ్జలమ్మ తల్లి ఆడియో ఆవిష్కరణ



ఆడియో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, నృత్య కళాకారుడు, రచయిత మ్యాజిగె రవి రూపొందించిన గజ్జలమ్మ తల్లి ఆడియోను గురువారం రాత్రి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గజ్జలమ్మ ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. కవులను, కళాకారులను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్, ఎంపీటీసీ సుధాకర్, కోఆప్షన్ సభ్యుడు గౌస్, కవులు సత్యానందపు గడ్డపు గజ్జారాం, తాటి శివ, మహేందర్, గాయని తోకల నర్మద, జీవీ.రమణారావు, ఎస్.రమేష్, పిప్పెర వెంగళరావు, పసుల నవీన్ గంగయ్య, కె.రమణారావు, బోగ గోవర్ధన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంకల్పయాత్ర విజయవంతం

నిర్మల్: ప్రజల్లో బీజేపీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని, కుమురంభీమ్ క్లస్టర్‌లో భాగంగా జిల్లాలో చేపట్టిన విజయసంకల్పయాత్ర విజయవంతమైందని యాత్ర సహప్రముఖ్ రావుల రాంనాథ్ తెలిపారు. జిల్లాలోని బాసర, భైంసా, కల్లూరు నర్సాపూర్, దిలావర్‌పూర్, నిర్మల్‌లో యాత్ర రోడ్‌షో, కార్నర్‌మీటింగ్‌లు విజయవంతం అయ్యాయని వివరించారు. ఈ యాత్రతో ప్రజల్లో మోదీపై ఉన్న ఆదరణ వెల్లడైందని, రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విజయసంకల్పయాత్రను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై ఆరోగ్య సహాయకులకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధన్‌రాజ్ మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఎదురు అయ్యే స్ట్రెస్‌ను ఎలా అధిగమించాలి, స్ట్రెస్‌తో కలిగే నష్టాలను వివరించారు. శిక్షణ తీసుకున్న ఆరోగ్య సహాయకులు అందరూ జిల్లాలోని ఆయా పాఠశాలలను సందర్శించి అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు, ఒత్తిడి లక్షణాల గురించి, దానిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలు, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ పద్ధతుల గురించి సైకియాట్రిస్ట్ డాక్టర్ సురేష్ వివరించారు. శిక్షణ కార్యక్రమంలో అధికారులు డాక్టర్ నయన రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, జిల్లాలోని ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

25న సీఓఈ సెకండ్ స్క్రీనింగ్ టెస్ట్

- ఆదిలాబాద్ రీజియన్‌లో నాలుగు పరీక్ష కేంద్రాలు
- గురుకుల వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు

బెల్లంపల్లి: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 25న సెకండ్ స్క్రీనింగ్ టెస్ట్ జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 4న నిర్వహించిన మొదటి విడత ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను రెండో విడత పరీక్ష రాయడానికి అవకాశం కల్పించారు. సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, బెల్లంపల్లి సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు తెలిపారు. బాలబాలికల కోసం రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, లక్సెట్టిపేట, చెన్నూర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులకు డిస్క్రిప్టివ్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తారు. అనుమానాల నివృత్తి, ఇతర వివరాల కోసం 9948714105 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల అభిరుచులను ప్రోత్సహించాలి



క్రీడా దినోత్సవ వేడుకల్లో విద్యార్థులతో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా తల్లిదండ్రులే వారిని ప్రోత్సహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలోని జీవీఎస్ఆర్ పాఠశాలలో క్రీడాదినోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో హాజరై మాట్లాడారు. విద్యార్థుల మానసిక, శారీరక మానసిక వికాసంలో తల్లిదండ్రులపాత్ర కీలకమని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న అభిరుచులను, అంతర్గత నైపుణ్యాలకు గుర్తించి తదనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని సూచించారు. చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించినపుడు కుటుంబ సభ్యులు ఇచ్చే చిన్నప్రశంస వారిలో అంతర్గతంగా ఉత్తేజం నింపుతుందన్నారు. చిన్నారులు మన కుటుంబ గౌరవాన్ని సమాజంలోకి తీసుకెళ్లే ప్రతినిధులుగా తయారుచేయాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. విద్యార్థుల్లో ఈ నైపుణ్యాలను పెంపొందించాలని కోరారు. ఒత్తిడిని జయించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎస్ఆర్ పాఠశాల ఎగ్జిబిషన్ సొసైటీ చైర్మన్ కె.శ్యాంసుందర్, సెక్రెటరీ వనం సురేందర్, కోశాధికారి మంజీత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మణికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అలేఖ్య కుటుంబానికి న్యాయం చేయాలి

- ఎస్పీకి అఖిలపక్షం నేతల వినతి



ఎస్పీని కలిసి విన్నవిస్తున్న అఖిలపక్షం నేతలు

ఖానాపూర్: ఇటీవల ఖానాపూర్ పట్టణంలో ప్రేమోన్మాది శ్రీకాంత్ చేతిలో హత్యకు గురైన అలేఖ్య కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు నిందితుడికి కఠిన శిక్షపడేలా చూడాలని అఖిలపక్షం నాయకులు కోరారు. అలేఖ్య కుటుంబీకులతోపాటు దాడిలో తీవ్రంగా గాయపడ్డ మరో యువతి జయశీలతో కలిసి గురువారం ఎస్పీ జానకి షర్మిలను కలిశారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన ఖానాపూర్‌లో వెలుగు చూసిన విషసంస్కృతిని ఇంతటితో నిలిచిపోయేలా నిందితులకు కఠిన శిక్షపడాలన్నారు. తీవ్ర గాయాలతో ఉన్న జయశీలతోపాటు ఆమె కుమారుడు రియాన్స్‌ను ఎస్పీ ఓదార్చి ధైర్యం చెప్పారు. కేసు విచారణ వేగవంతం చేసేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు కోసం పోలీస్ శాఖ తరఫున ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఎస్పీని కలిసినవారిలో నంది రామయ్య, కె.రాజన్న, జన్నారపు శంకర్, నాగెల్లి నర్సయ్య, ప్రణీత్, వెంకటస్వామి, మోహన్, రాకేశ్, పురుషోత్తం, రామ్‌లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.